


శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీ కీ జై!
గురుకృప
విజయదశమి సంచిక
జన జాగృతం.. జగత్కళ్యాణం...

# Promise in Love





ఈ త్రిభువనాల్లో సద్గురువుకు మించిన ఉదార దాత మరెవ్వరూ లేరు. మనం దాసానుదాసులమై సద్గురువుకు పరమ శరణ్యం చేద్దాం. కేవలం సద్గురువుని మాత్రమే శరణుపొందుదాం. సద్గురువుని చింతామణితో కూడా పోల్చడం సరికాదు. చింతామణి కేవలం మనం కోరింది మాత్రమే ఇస్తుంది. సద్గురువు అలా కాదు. మనం ఊహించను కూడా ఊహించలేని దాన్ని మనకు ప్రసాదించి, మనలను ఆశ్చర్యపరుస్తాడు. సద్గురువును కల్పతరువుతో కూడా పోల్చడం సరికాదు. మనం అడిగినవి మాత్రమే కల్పతరువు ఇస్తుంది. కాని గురురాయుడు అలా కాదు. కామధేనువుంది. అది మనం కోరిన కామనలనే తీరుస్తుంది. కాని గురుధేనువు దానికన్నా ఘనుడు. అతన్ని 'అచింత్యదాత' అంటారు. సద్గురువుకే ఈ బిరుదు సరిపోతుంది.

- సాయి సచ్చరిత్ర, అధ్యాయము 16, ఓవీ 17-ఓవీ 20

www.saibaba.com

సంపుటి : 11

# గురుకృప


సంచిక : 4



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీ బాబూజీ



## లోపలి పేజీలలో


ఉన్నమాట-అనుకున్నమాట 4
- ఉపేంద్ర

సద్గురువు లేనిదెక్కడ? 8
- గోపాలరావు

ఋణానుబంధమా? 'కరుణా'నుబంధమా? 9
- వాణి

ఏది పసిడి? 12
- రవి కుమార్

బాధ్యతా? బంధమా? 14
- విజయ మాలతి

ఏది శిరిడీ? ఏది నీ ఒడి? 16
- లక్ష్మి

ఇంకా మరికొన్ని లోపలి పేజీలలో...



నిర్వహణ : *గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు*

**GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01. Ph : 93933 61778**

**Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Ph : 2740222**

# కమనీయ కళ్యాణం


ఇద్దరి మనసులు, మాటా ఒకటై, ఒకరి కోసం ఒకరుగా, ఇద్దరు ఒకటిగా, అన్ని వేళలా ఒకరికొకరు తోడూ నీడగా నిలిచి, సుఖసంతోషాలను, కష్టసుఖాలను ఇద్దరూ సమంగా స్వీకరించి సహజీవన ప్రయాణం సాగించేందుకు – జీవిత పథంలో వేసే మొదటి అడుగు **'వివాహం'** అంటారు **పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ.**

**✹ *మగ 'సిరిలేని' మహారాజులు***

కానీ, నేడు పెండ్లి వెనుకనున్న పరమార్థం మరుగున పడిపోయింది. పెండ్లి అనగానే – పెండ్లి వారిని మొదట అడిగే ప్రశ్న 'ఎంత కట్నం ఇస్తున్నారేమిటి?' అని. తరువాత అనుబంధ ప్రశ్నలు "జాతకాలు కలిసాయా?.. బంగారం ఎంత పెడుతున్నారు? ఆడపడుచు కానుకలు ఏమైనా ఉన్నాయా? పెండ్లి ఖర్చులకు ఎంత ఇస్తున్నారు?"... ఇలా 'సా...గు'తాయి. మగ'సిరి'ని బేరానికిపెట్టి, అవసరమైతే వేలం వేసి, నేను ఇన్ని లక్షలు తీసుకొంటున్నానని నిర్లజ్జగా, బాజాలు మ్రోగించి మరీ గొప్పలు చెప్పుకునే మగ 'సిరి లేని' మహారాజులకు మన సమాజంలో కొదవేలేదు. మొలన మొలత్రాడు కట్టుకున్న ప్రతివాడికీ – పెండ్లి ముసుగులో అప్పనంగా ఆడపెండ్లివారిని నిలువునా దోచుకోవాలనే దురాశకు అంతేలేదు. నేడు ***పెళ్లిళ్లు అనగానే వరుల వ్యాపారానికి 'లైసెన్స్' తీసుకున్న 'ఏ సెన్స్' లేని విక్రయ కేంద్రాలయ్యాయి.*** 'అందరితోబాటే మనం కూడా' అని సర్దిచెప్పుకొని... ఒకరు కష్టపడి కూడబెట్టుకున్నదంతా 'కన్య'తో బాటు కాళ్లు కడిగించుకుని మరీ 'దానం' స్వీకరించడానికి, నిస్సిగ్గుగా, దర్జాగా, బాహాటంగా దోపిడీ చేసుకోవడానికి ఏర్పరచుకున్న వేదికలయ్యాయి. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా మందికి ఉందనుకుంటున్న 'ఆత్మగౌరవం' దెబ్బతిని గాయపడుతుంది. ఒకవేళ ఉంటే... ఆ మర్యాద మంటకలసి పోతుంది.

**✹ *ఆదర్శానికి ఆరంభం***

పూజ్యశ్రీ బాబూజీని తమ పెద్ద దిక్కుగా, సర్వస్వంగా భావించి తమ సాధకబాధలు విన్నవించుకునే పలు సందర్భాల్లో కొందరు భక్తులు – సాయిసన్నిధిలో శ్రీబాబూజీ చేతుల మీదుగానే తమ పిల్లల వివాహాలు జరగాలన్న తమ కోరికను విన్నవించుకునేవారు. ముఖ్యంగా ఆడపిల్లల తల్లిదండ్రులు – అన్నీ కుదిరినా – కూతురు పెండ్లి వైభవంగా చేయాలనే ఆశ ఉన్నా –పెండ్లి చేయాలంటే ఖర్చు భరించ కలిగే ఆర్థికవనరులు, వెసులుబాటు తమ వద్ద




సద్గురు సాయినాథుడు
సర్వులను అనుగ్రహించు గాక !

లేవని–తమ ఆవేదనను నివేదించేవారు. మరికొందరు భక్తులు – వివాహాలు సందర్భంగా చేసే అనవసరమైన హంగులు, ఆర్భాటాలు, తంతులకు తావు లేకుండా శ్రీబాబూజీ ఆకాంక్షకు అనుగుణంగా సాయి చూపిన మార్గంలోనే, సాయి సత్సంప్రదాయానికి నిలువుటద్దం పడుతూ తమ పిల్లల వివాహాలను – గురుబంధువులందరి సమక్షంలో జరుపుకోవాలన్న తమ అభిలాషను వ్యక్తం చేసేవారు. ఇలా భక్తుల అవసరం, ఆకాంక్షలకనుగుణంగా గురుపూర్ణిమ, విజయదశమి పర్వదినాల్లో–శిరిడీలో సాయిపథం ఆవరణలో జరిగే ఉత్సవాల్లో భాగంగా వివాహాలు జరుపుకోవడమన్నది క్రమంగా రూపుదిద్దుకుంది.

కట్నకానుకలు, జాతకచక్రాలు, గ్రహశాంతులు, దంబాచారాలు, హంగులు, ఆర్భాటాలు – ఇవన్నీ కళ్యాణానికి కొలమానాలైన నేపథ్యంలో – పేద ధనిక తారతమ్యాలు – వీటన్నింటికి అతీతంగా, తంతులు లేని సాయి నిజతత్వాన్ని దర్శింపజేస్తూ, శ్రీసాయి సత్సంప్రదాయానికి, విలువలకు నిలువుటద్దం పట్టే వేదికలుగా – వివాహ వేడుకలు జరగాలన్నది శ్రీబాబూజీ ఆకాంక్ష. వారి ఆశయానికి అనుగుణంగా – వధూవరుల తల్లిదండ్రులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా – సాయిపథం ఆవరణలోనే పర్వదినాల సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపైనే – వేలాది మంది గురుబంధువుల సాయినామాలపనల మధ్య – ఆ మహామహితాత్ముని చేతుల మీదుగా నిరాడంబరంగా, అత్యంత వైభవంగా వివాహాలు జరగడం ఆరంభమయ్యాయి.

### ✺ *తంతులేని సాయితత్త్వ దర్శనం*

ఆ మహనీయుని ఆశయాల కనుగుణంగానే సాయిపథం ఆవరణలో నిర్వహించే పెండ్లిళ్లు విభిన్నంగా జరుగుతాయి. పెండ్లిళ్లలో సాధారణంగా కనపడే విధంగా – లాంఛనాలు ఇవ్వలేదని, సరిగా చూడలేదని అలకపాన్పు ఎక్కి చేసే హడావుడి ఇక్కడ లేదు. వియ్యాల వారి కయ్యాలు లేవు. కట్నాలు, కానుకల దేబిరింపు లేదు. పేద–గొప్ప తారతమ్యం లేదు. ఈర్ష్యా ద్వేషాలు హవిస్సుగా వేసే కళ్ల 'మంటలు' లేవు. పురోహితులు మంత్రాలు వల్లెవేస్తుంటే 'మమ' 'మమ' అని మమ 'కారం'తో రొప్పడం లేదు. డాబుసరి వస్త్రాలు మార్చి మార్చి కట్టుకొని వచ్చే ఖరీదైన ఫ్యాషన్ 'షో' లేదు. కాళ్లు కడిగి, నెత్తిన చల్లుకొని, అడుగడుగునా అడుగులకు మడుగులొత్తడం లేదు. పరదాలు కట్టి, అటు ఇటు త్రిప్పి, నానాతిప్పలు పెట్టి తోలుబొమ్మల్లా ఆడించడం లేదు. మంత్రాలు, తంతులు, తంత్రాలు లేవు. పెత్తనాలు, హంగులు, ఆర్భాటాలు అసలే లేవు.



**"గురువుకు పగ్గాలు అప్పగించి నిశ్చింతగా ఊరక కూర్చుంటే చాలు! చేయవలసినదంతా నేను చేసి, మిమ్ములను చివరికంటా గమ్యం చేరుస్తాను!"**
**- అన్న శ్రీసాయి ఉపదేశం ఆయన బోధనసారమని చెప్పొచ్చు.**

***ఇక్కడ బాబా మతం – శ్రీబాబూజీ అభిమతమే అందరికీ సమ్మతం***. సాయిపథంలో – వేలాదిమంది భక్తుల సాయి నామాలాపన ప్రతిధ్వనుల మధ్య అద్వితీయంగా జరిగే వివాహాలు అసలైన సాయి సత్సంప్రదాయానికి అద్దం పడతాయి. పెండ్లి వారికి, అక్కడ ఉన్న వారికి ఎటువంటి ఒత్తిడి లేకుండా, ఏ హైరానాలు లేకుండా స్థిమితంగా కూర్చొని, ***సాయి మీదే ఆధారపడి అతి నిరాడంబరంగానూ, అత్యంత వైభవంగానూ జరిగే పెండ్లిళ్లు ఒక్క సాయిపథంలోనే చూస్తాం.***


### ✺ *మనం మారాలి – మార్పు రావాలి*

ఇక్కడ ఓ విషయం ప్రస్తావించాలి. సత్సంప్రదాయాలకు, ఆచారాలకు ఏ మహాత్ములు వ్యతిరేకం కాదు. అయితే కాలగతిలో ఆచారాలు, సాంప్రదాయ మూలాలు 'కాలధర్మం' చెంది, మరుగున పడిపోయి క్రమంగా మూఢాచారాలుగా, దుస్సాంప్రదాయాలుగా, తంతులుగా మిగిలిపోతున్నాయి. అందువలన, ఆయా దేశకాలపరిస్థితులకు అనుగుణంగా మహాత్ములు ఏర్పరిచిన ఆచార వ్యవహారాలు కాలక్రమంలో మార్పు చెందడం అవశ్యనీయం. ఈ నేపథ్యంలో, నిజమైన ధర్మాచరణ వదిలి వ్యర్థాచారాలతో మనం కాలం, ధనం, వివేకం ఎలా వృథాచేసుకుంటున్నామన్న విషయాన్ని సాహేతుకంగా శ్రీబాబూజీ పలుమార్లు వివరించారు.

'అనే' వాడికి 'వినే' వాడికి అర్థం తెలియని శబ్దాడంబరం చిలకపలుకుల కంఠశోష అవుతుందని శ్రీబాబూజీ నిరశిస్తారు. అందుకే పలికే ప్రతి మంత్రానికి అర్థం తెలిసుండాలంటారు. మన పెద్దలు ఎన్నో మంచి ఉద్దేశ్యాలతో ఆచారాలు, సాంప్రదాయాలు నెలకొల్పినా క్రమంగా వాటి మూలభావం పోయి తంతులై, మూడు గంటలు... అంతొద్దనుకుంటే గంటలోనే ముగిసిపోయే ముచ్చట్లైనాయి. ఆచారవ్యవహారాలేమైనా సరే వాటి మూలార్థం తెలుసుకొని, అవి ఎందుకు ఆచరించాలో అవగాహన వుండి ఆచరిస్తే అర్థవంతమవుతుంది తప్ప, లేకపోతే వ్యర్థమవుతుందంటారు.

### ✺ **కమనీయ దృశ్యకావ్యం**

సాయిపథంలో  జరిగే వివాహాలను వర్ణిస్తే అదో కమనీయ దృశ్య కావ్యమవుతుంది. భక్తులు తమ ప్రేమను పూల మాలలుగా చేసి అలంకరించిన ఎత్తైన వేదిక. ఆ వేదికపై జరిగే వివాహాలకు సాక్షీభూతుడై నిలిచిన నిలువెత్తు సాయిబాబా చిత్రపటం. మనస్సును దోచుకునే రమణీయ సౌందర్యానికంతా రూపునిచ్చిన సాయి రూపం. వేలాదిమంది సాయిభక్తుల సాయి నామాలాపన తోరణాలు, కళ్యాణ శోభతో ముగ్ధ మనోహరంగా సింగారించుకున్న ఆహ్లాదకరమైన పరిసర వాతావరణం.... ఇవన్నీ కలబోతగా ఆవిష్కరించే ఆనంద క్షణాలు.



**ఆత్మోద్ధరణకు వివేకాభ్యాసాలు రెండూ అవసరం.**
**వివేక శూన్యమైన అభ్యాసం క్రమంగా దురభ్యాసంగా మారక తప్పదు.**

వధూవరులు కన్న కలలు, వారి కన్నవారి కలలు సాయి అనుగ్రహ ఆశీర్వాదంతో సాకారమయ్యే ఆనందక్షణాలు, ఆ మహితాత్మునికి మంగళ నీరాజనాలర్పిస్తూ స్వాగతిస్తున్నాయి. భక్తుల హృదయ స్పందనలు సాయి నామానికి శృతిలయలైన వేళ ఆ ఆనందక్షణాలు రానే వచ్చాయి. భక్తులతో కలిసి సాయినామ సంకీర్తనలో పాల్గొనడానికి పూజ్యశ్రీ బాబూజీ వచ్చారు. భక్తుల్లో సంతోష సాగరం ఒక్కసారిగా ఉప్పొంగింది. సాయినామ ప్రతిధ్వనులు మిన్నునంటాయి. శ్రీబాబూజీ అందరినీ పరికించి చూసి ధ్యానస్థులయ్యారు. కాలం కరిగిపోతుంది. వధూవరులు సిగ్గు దొంతరలు తొలగించుకుని వారి తల్లిదండ్రులతో కలసి వేదిక పైకి వచ్చారు. శ్రీసాయికి, శ్రీబాబూజీకి నమస్కరించుకున్నారు. ఆ మహనీయుని అంత దగ్గరగా చూసే మహద్భాగ్యాన్ని వర్ణించడానికి ఏ పదాలు సరిపోవు. ఒక్కసారిగా ప్రకృతి పరవశంతో పులకించిపోయింది. వధూవరుల తల్లిదండ్రులు తాళిబొట్టును శ్రీబాబూజీ సతీమణి శ్రీమతి అనసూయమ్మగారికిచ్చి శ్రీబాబూజీకి అందించవలసిందిగా అభ్యర్థించారు. అమ్మగారు అందించిన మంగళసూత్రాన్ని అలాగే పట్టుకుని శ్రీబాబూజీ బాబా చిత్రపటంవైపు తిరిగి కొన్ని క్షణాలు ధ్యానస్థులయ్యారు. అనంతరం ఆ మంగళసూత్రాన్ని వరుడు చేతికి అందించారు. సాయినామం ఉత్తేజంతో ఊపందుకొంది. శ్రీబాబూజీ ప్రేమగా వారిని చూస్తున్నారు. ఆ చూపుల ద్వారా పెండ్లి రోజు చేసే ప్రమాణాలకు ఆధారమైన భావాలు నిక్షిప్తమవుతున్నాయి. మూడుముళ్ల సాయి బంధంతో రెండు మనస్సులు, రెండు జీవితాలు ఒక్కటయ్యాయి. శ్రీసాయి అనుగ్రహ హారాలైన పూలమాలలు శ్రీబాబూజీ చేతుల మీదుగా నవదంపతులు అందుకొని మార్చుకున్నారు. సాయి అనుగ్రహానికి ప్రతీకైన 'ఊదీ'ని శ్రీబాబూజీ నవదంపతులకు అందించారు. నవదంపతుల తల్లిదండ్రుల, ఆత్మీయుల హృదయాల్లో అవధులు దాటిన ఆనందం పెల్లుబికి కంటి సరిహద్దు దాటింది. తమతోపాటు, తమ బిడ్డల బాధ్యతలను వహించి వివాహం జరిపించిన ఆ మహాత్మునికి నవదంపతుల తల్లిదండ్రులు శిరస్సు వంచి నమస్కరించారు. శుభాకాంక్షలు తెలుపుతూ ఆత్మీయులు నవదంపతులను అనురాగ పల్లకిలో ఊరేగిస్తున్నారు. ఈ ప్రపంచమంతా మాదే – ఈ ప్రపంచం ఉంది మా ఇద్దరి కోసమే అన్నట్లు గుండె నిండా ఆనందాన్ని, ఊపిరినిండా ప్రేమను నింపుకొని నవదంపతులు ఆ మహితాత్ముడు తమకై నిర్మించిన సరిక్రొత్త ప్రేమ ప్రపంచంలోనికి అడుగులు వేసారు. సాయిబాబా... సాయిబాబా అని పిలుస్తూ, సాయి ఆనందాంబుధే గమ్యంగా అనంత సాయినామ స్రవంతి కొనసాగుతూనే ఉంది.

✺ **జనజాగృతం... జగత్కళ్యాణం : గురుచరణ కమలాలకు సభక్తిపూర్వకంగా అంకితమయిన 'గురుకృప' ఈసారి మరింత శోభను సంతరించుకుంది. శుష్కమైన దేనినీ సమర్ధించని సద్గురుపథం ఈనాడు వివాహ వ్యవస్థలో ఉన్న లోటుపాట్లను తూర్పారబట్టి, ఒక సమగ్ర జీవన విధానానికి దారి చూపుతూ జనజాగృతికి(మేలుకొలుపు) కంకణం కట్టుకుంది. ఈ జాగృతి నూతనత్వానికి నాంది. ఆనందమయ జీవితాలకు పునాది. సాయి చెంతన తంతులు లేకుండా సాగే ఈ కళ్యాణాలు తెచ్చే మార్పు కేవలం కళ్యాణం చేసుకున్న ఆ జంటలకు మాత్రమే పరిమితం కాకూడదు. ఆడంబరాల అలజడిలో కొట్టుకుపోతున్న జగత్తును మేల్కొలుపుతూ, జగత్కళ్యాణానికి నాందీ ప్రస్తావన కావాలి.**




**సద్గురు కృపకు శరణాగతికి మనను దూరం చేసే బూజు పట్టిన ఆచారాల బారినుండి మనను ఆ సాయినాథుడే కాపాడుగాక !**

# సద్గురువు లేనిదెక్కడ?

నా పేరు గోపాలరావు. మాది తెనాలి. నేను బెంగుళూరు నుండి తెనాలి వచ్చేటపుడు జరిగిన అనుభవం మీతో పంచుకుంటున్నాను. మా కుటుంబం, మా తోడల్లుడుగారి కుటుంబం జూన్ 26, 2008న బెంగుళూరు, మైసూరు, ఊటీ వగైరాలు చూసుకొని తిరిగి బెంగుళూరు చేరాము. నా భార్య లలిత కుమారి బెంగుళూరులో వున్న మా పిల్లల దగ్గర ఒక వారం రోజులు ఉండి వస్తానని చెప్పింది. అందువలన నేను ఒక్కడినే బెంగుళూరు నుండి తెనాలి బయలుదేరాను. బస్సు కోలార్ దగ్గర ఒక ఆటోను తప్పించడానికి ప్రయత్నించినపుడు రోడ్డు మార్జిన్ దాటి బస్సు బోల్తా పడింది. బస్సులోని వారందరం ముందు, వెనుక అద్దాలు పగలుకొట్టుకొని బయటకు వచ్చాము. ఆ ఊరివాళ్లు మమ్మలను బయటకు తీసుకురావటానికి, సామానులు బయటకు తీసుకురావటానికి ఎంతో సహాయపడ్డారు. బస్సులో ఇద్దరు, ముగ్గురికి తప్ప ఇంకెవ్వరికీ దెబ్బలు తగలలేదు. వారిని హాస్పిటల్‌లో చేర్చారు. ఈ ప్రమాదం సుమారు రాత్రి పదకొండు గంటలకు జరిగింది. జరిగిన ప్రమాదం పెద్దదే కాని, కానీ ఎవ్వరికీ ఏమీ కాలేదు. ఇలా బాబా, గురువుగారు మాతో ఉన్నందు వలన బస్సులోని వారందరం ప్రమాదం నుండి బయటపడ్డారు. నేను తిరిగి ఆ అర్ధరాత్రి బెంగుళూరు చేరాను.

మర్నాడు నేను, నా భార్య, మా అమ్మాయి, మా మనవరాలు బెంగుళూర్ ఇందిరానగర్‌లో ఉన్న సాయిబాబా మందిరానికి వెళ్లాం. మేము వెళ్లే సమయానికి ఆరతి జరుగుతుంది. మేము బాబాకు నమస్కరించుకుని అక్కడే నిలబడి ఉన్నాం. ఇంతలో ద్వారం దగ్గర ఉన్న మందిరం తాలూకు మనిషి బాబా విగ్రహం వద్దకు వచ్చి, అక్కడ ఉన్న తెల్లని పూలదండ నా భార్యకు ఇచ్చాడు. అపుడు నా భార్యను, మా అమ్మాయి "అమ్మా! పూలదండ నీవు అడిగావా?" అని ప్రశ్నించగా, నా భార్య "లేదు! అతనే ఇచ్చాడు" అని అన్నది. అపుడు మా అందరికీ చాలా సంతోషం వేసింది. మాకు బాబా నేను ఉన్నాను, భయపడవద్దు అని చెప్పినట్లు అనిపించింది. తర్వాత మా మనవరాలికి **సాయిస్ఫురణ** అని పేరు పెట్టింది, అన్న ప్రాసన చేసినది గురువుగారే. మా కుటుంబ సభ్యులందరికీ కూడా బాబా, గురువుగారు అంటే చాలా ఇష్టం. ఇలాగే మేమందరం బాబా, గురువుగార్ల పాదాలు జీవితాంతం పట్టుకొని వదలకుండా ఉండేటట్లు చేయాలని, బాబా, గురువుగార్ల ఆశీస్సులు మాపై నిరంతరం ఉండాలని వారిని మనసారా వేడుకుంటూ నమస్కరించుకుంటున్నాం.



**శ్రీసాయి అవతార కార్యంలో అసలైన ఆధ్యాత్మిక సత్సాంప్రదాయ రక్షణ, సద్గురు సంప్రదాయ స్థాపన అత్యంత ముఖ్యాంశాలుగా దర్శనమిస్తాయి.**

I have to take care of my children day and night and give an account to god of every paise. అనుక్షణం నా బిడ్డల యోగక్షేమాల బాధ్యత వహిస్తూ, ప్రతి పైసాకు సంబంధించిన లెక్కను నేను భగవంతునికి సమర్పించుకోవాలి. కంటికి రెప్పలా కాపాడే సాయితల్లి తన బిడ్డకు కష్టమొచ్చినపుడల్లా చేయి చాచి ఒడిలోనికి తీసుకుని లాలిస్తూనే ఉంది. కష్టంలో ఉన్నపుడు తల్లి తాబేలులా తన మనోదృష్టితో కాపాడింది – ద్వారం వద్ద బిడ్డకై ఎదురు చూస్తున్న మాయిలా, ఇంటికి చేరాక లాలించి, పుష్పాల రూపంలో ఆశీస్సులను ఇచ్చింది. ఇలా సాయితల్లిని తమకు దర్శింపచేసిన సద్గురుదేవులు శ్రీబాబూజీకి మమతల తోరణాలు కట్టి – మా ఇంట కొలువుండమని వేడుకుంటోంది ఈ కుటుంబం.

## ఋణానుబంధమా? 'కరుణా'నుబంధమా?

సద్గురు చరణాలకు నమస్కరించి మీ అందరితో నా అనుభవాన్ని పంచుకుంటున్నాను. నాపేరు వాణి. సద్గురు అనుగ్రహాన్ని మీతో పంచుకుంటూ నేను కూడా సద్గురు స్మరణలో సాగుదామని నా ప్రయత్నం. యజమాని – శ్రద్ధగా పనిచేసే పనివాడికి, ఆడబిడ్డకు – పుట్టింటివాళ్లు కూడా ఇంత పరిపూర్ణంగా అన్నీ అమర్చరని నాకు అనిపిస్తుంది. మాది కూర్మాపురం, తూర్పుగోదావరి జిల్లా. మావారు బిఎస్‌సి చేసారు. ఉద్యోగం లేని రోజున వ్యవసాయం చేసారు. సొంత ఇల్లు, స్థిరమైన ఉద్యోగం లేక ఎన్నో ఇబ్బందులు పడ్డాము. స్థిరత్వం కోసం ఎన్నో మొక్కులు మొక్కుకున్నాను. పూజలు చేసాను. మావారు కొన్నాళ్లకు పూనేలో ఆల్కహాల్ టెక్నాలజీ చేసారు. ఆ సమయంలో శిరిడీ వెళ్లి చిన్న బాబా చిత్రపటాన్ని కూడా తెచ్చారు. బాబా ఆశీస్సులతో మాకు లోటు అయితే లేదు కానీ, ఇంకా స్థిరత్వం చిక్కాలని అనుకునేదాన్ని. మావారు వృత్తినే దైవంగా భావించి, సత్సంగానికి, పారాయణలపట్ల శ్రద్ధగా ఉండేవారు కాదు. కాలచక్రంలో నాలుగు, ఐదు సంవత్సరాలు గడిచాయి. పాప బిఎస్‌సి బయోటెక్నాలజీలో చేరి, కొత్త సబ్జెక్టు, మీడియం మారడంతో చాలా ఇబ్బంది పడి డిగ్రీ చదవడం ఆగిపోయింది. తను చదివి బాగుపడాలనే తపనతో నాకు తెలియక 12 సార్లు పారాయణలంటూ, ఉపవాసాలుంటూ, పాప చదువు గురించి బెంగపడి ఆరోగ్యం పాడు చేసుకున్నాను. గురుదేవులు సాయిభక్తి సాధనా రహస్యంలో చెప్పినట్లు

"దీర్ఘకాల ఉపవాసాలుండడం వల్ల శరీరంలో ధాతువైషమ్యం కలిగి, దేహారోగ్యం దెబ్బతినడమే కాక, క్రమంగా ఎన్నో మనో వికారాలకు కూడా దారి తీస్తుందని కూడా వైద్యశాస్త్రం హెచ్చరిస్తున్నది. ఎన్నో రకాల 'క్యాన్సర్'లకు, ముఖ్యంగా 'లుకేమియా'కు దారితీసే ప్రధాన కారణాలలో ఆకలిని చంపుకోవడం ఒకటని ఆధునిక వైద్యశాస్త్రం



వక్కాణిస్తున్నది". ఇలా 12.2.2002వ సం॥ నాకు లుకేమియా (బ్లడ్ క్యాన్సర్) ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. నేను ధైర్యం కోల్పోలేదు. నేను నమ్మింది బాబాను. చెల్లూరు సాయి మందిరానికి వెళ్లి బాబాకు చెప్పుకున్నాను. నాకు పది సం॥ల సమయం కావాలని. నా బాధ్యతలన్నీ తీర్చుకుంటాను సమయమివ్వమని. చెల్లూరు నుండి వెల్లూరు వెళ్లాను క్యాన్సర్ హాస్పిటల్‌కు. డాక్టర్లు నా పరిస్థితి చూసి, ఇప్పటి మందులు మూడు లేక నాలుగు సంవత్సరాలకు మించి పనిచేయవు. మరో ఐదు లేదా ఆరు సం॥ల తరువాత భారతదేశంలో మంచి మందులు దొరకవచ్చు. అయితే అప్పటిదాకా ఈమె జీవించడం కష్టం అన్నారు. చివరకు 'బోన్‌మారో' చేయించుకున్నా, ఫలితం దక్కదని తేల్చారు. మావారు చాలా బాధపడ్డారు. నిర్జీవంగా రోజులు గడుస్తున్నాయి. ఆయుర్వేదంలో తగ్గుతుందంటే అదీ వాడాను. 2002 సం॥ నవంబర్‌లో శిరిడీ వెళ్లాను.

మానవజన్మ చాలా ఉన్నతమైనది. దానిని సార్థకం చేసుకోవాలంటే సద్గురువు కావాలి. నా గురువు ఎవరు? నా జీవితం ఎలా సార్థకం అవుతుందని? తపించాను. 2003 ఫిబ్రవరిలో చెల్లూరు సత్సంగంలో సత్సంగం గురించి, సద్గురుని ప్రాముఖ్యత గురించి విన్నాను. సాయిబాబా నామం చెప్పారు. ఆనాడు నాకు తెలియలేదు గురువుగారి విలువ. సాయికి, మనకు వారు 'అడ్డు' అనుకున్నాను. బాబాకు, మనకు మధ్య ఉన్న ***'అడ్డుగోడ'*** ను కూల్చవచ్చిన ***మహితతత్త్వమని,*** మనను ఇంకా దగ్గరకు చేర్చుకునేందుకు సాయి ఇచ్చిన వరమని అర్థమయ్యి, వారి పాదాల చెంత సేద తీరుతున్నాను. మన మనసనుభవించే సర్వానుభూతులను ఒక నాదంలా మీటుకునేందుకు వారు ప్రసాదించిన 'సాయిబాబా' నామమనే వీణను మనఃపూర్వకంగా వాడుకుంటున్నాను. నాకు లుకేమియా అని తెలిసి, తెలిసినవాళ్లు ఒక మతబోధకుడిని తెచ్చి ప్రార్థన గావించారు. కన్నీళ్లతో ప్రార్థించమనేవారు ఆయన! బాధతో కరడుగట్టిన మనసు కరిగింది కాదు. ఈ జీవి ఋణం మనది కాదనుకున్నారో ఏమో! మరల అలాంటి ప్రార్థన జరగలేదు.


2003 నుండి క్రమం తప్పకుండా సత్సంగానికి వెళ్లాను. ఒక్కవారం వెళ్లకపోయినా ఏదో వెలితిగా ఉండేది. 2003 గురుపౌర్ణమికి శిరిడీ వెళ్లాము. గురువుగారిని చూసిన మొదటిసారే ఆ చూపు నా చూపులో కలిసిన భావన, అదొక మెరుపు. సురేష్‌బాబుగారు నా రిపోర్ట్స్ తీసుకురమ్మన్నారు. గురువుగారు నా రిపోర్ట్స్ చూసి ఏమైనా చెప్తారని ఆశించాను. వారి మౌనంతో చాలా నిరాశ చెందాను. శిరిడీ నుండి బయలుదేరే రోజు రాబోతుంది. అందరూ వారి వారి ఇబ్బందులను, విన్నపాలను గురువుగారితో చెప్పుకొని వారి ఆశీస్సులు తీసుకుంటున్నారు. ఒకరోజు దు:ఖం ఆపుకోలేని నేను గురుబంధువులందరినీ నెట్టుకుంటూ ముందుకు వెళ్లి వారి



**"నన్ను ఆనందస్వరూపంగా ధ్యానించు! అది సాధ్యపడకపోతే, నా యీ రూపాన్ని ధ్యానించు!" అన్నది శ్రీసాయి ఉపదేశం.**

పాదాలపైపడి, "నేను మూడు సంవత్సరాలకంటే బ్రతకనన్నారని, నాకు బ్లడ్ క్యాన్సరని, నా బాధ్యతలు నిర్వర్తించేందుకు నన్ను బ్రతికించమని విలపించి, పడిపోయాను". తోటి గురుబంధువులు ఏమిటి ఏమిటని అడిగారు. నేను చేసిన తీరుకు పశ్చాత్తాపంతో ఏడుస్తూ, రూమ్‌కి వెళ్లి నిద్రించాను. మేము ఉన్న రూమ్ సాయిపథానికి, బాబా మందిరానికి మధ్యలో ఉంది. సద్గురు ఆశీస్సులా అన్నట్లు ఎప్పుడూ వినిపించని 'సాయిబాబా' నామం ఆ రోజు అక్కడకు స్పష్టంగా వినిపించింది. గురుదేవులు నాకు ప్రసాదించిన మహత్తర మంత్రం 'సాయిబాబా' అనుకుంటూ అప్పటి నుండి సాయినామంతో వారి అనుగ్రహాన్ని ఎరుకలోనికి తెచ్చుకుంటూ సాగుతున్నాను. గురువుగారి చెంతకు చేరిన నాటి నుండి నేటి వరకు ప్రతీ సంఘటన ఒక అనుభవమే. నా కుటుంబం, నా చుట్టూ ఉన్న వాళ్లు ఎవరికైనా సరే అడిగినది ఇవ్వని సందర్భం లేదంటే అతిశయోక్తి కాదు. స్థిరత్వం లేని మాకు అవసరం ఉన్న ప్రతి సందర్భంలోనూ, మావారికి ప్రమోషన్లను, ఇంక్రిమెంట్లను ఇచ్చారు బాబా-గురుదేవులు. ఇలా ఉద్యోగరీత్యా మావారికి చాలా సందర్భాలలో పెద్ద సిఫార్సు లేఖ ఏమంటే నేను బాబా, గురువుగార్ల వద్ద రాసి పెట్టుకున్న లేఖే. మా బాబు ఎంసిఎ చేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూ, "అమ్మా! బాబా, నువ్వు అడిగినవన్నీ ఇస్తారంటావు కదా! నాకు ఉద్యోగం ఇవ్వరేం?" అన్నాడు. ***అడిగినంతనే గ్రక్కున వరములిచ్చెడి వేల్పుకు*** ఒక ఉత్తరం వ్రాసుకున్నాను. ***ప్రత్యుత్తరం వాడికి ఉద్యోగం.*** 2005 జూన్‌లో పాపకు పెళ్లి జరిగింది. ఆర్థికంగా ఇబ్బంది అవుతుంది అనుకుంటే మా వారికి పదివేలు ఇంక్రిమెంట్ ఇప్పించారు. బాబుకు కూడా వివాహం చేసాము. వాడు కూడా ఆనందంగా ఉన్నాడు. నాకు లుకేమియా వల్ల వస్తున్న బాధకు తాళలేక చనిపోదామనిపించింది. సచ్చరిత్ర నాకు అవగాహన ఇచ్చింది. నెలకు 55వేల రూపాయల ఖర్చు తట్టుకోవడానికా అన్నట్లు బాబును కొన్నాళ్లు అమెరికా పంపారు గురుదేవులు. ఎప్పటికప్పుడు బ్రతకడం కష్టం అనుకున్న నాకు ఇప్పటికీ ఆరు సంవత్సరాల ఆయువునిచ్చి అన్ని బాధ్యతలు చక్కగా నిర్వర్తింపచేసారు గురుదేవులు. ఈ జీవితం ఆయన పెట్టిన భిక్ష. ఎప్పటికీ సద్గురువే నాకు రక్ష.

This Masjid Ayi will save all those who place their faith in her. If a devotee is about to fall, I stretch out my hands to support him. ఎవరయితే ఈ మసీదు తల్లిపై విశ్వాసముంచుతారో వారందరూ రక్షింపబడతారు. నా భక్తుడు పడిపోబోతుంటే, నా చేతులు చాచి వానిని రక్షిస్తాను. సద్గురుమాయి చెంతకు చేరి ఆశ్రయించిన ఏ ఒక్క వ్యక్తి వట్టి చేతులతో వెనక్కు వెళ్లింది లేదు. నా భక్తుడు కోరినవన్నీ ఇస్తానన్న సాయి అభయానికి



ఈ అనుభవం సోదాహరణం. ఆ మసీదు తల్లి ప్రేమను మరొక్కసారి గుర్తుకు తెచ్చే కమనీయ కరుణా స్వరూపం, 'సాయి ఉన్నారన్న' అభయమివ్వడమే 'శృతి'గా చేసుకున్న మహోన్నత మూర్తి శ్రీబాబూజీ కరుణకు నిదర్శనం - నిలువెత్తు దర్శనం.

## ఏది పసిడి?

పూజ్య గురుదేవులు శ్రీసాయినాధుని శరత్‌బాబూజీ గారి పాద పద్మములకు నమస్కరిస్తూ.. గురుదేవుల అనుగ్రహామృతాన్ని నా అనుభవాల ద్వారా అందరితో పంచుకుంటూ...

నా పేరు రవి. మాది హన్మకొండ. నేను 2002లో లా ప్రవేశపరీక్ష వ్రాసాను. పరీక్షలో ఉత్తీర్ణుడయిన తరువాత నాకు యల్.యల్.బి. చేయాలా? వద్దా? అనే సందిగ్ధం ఉండి, గురువుగారి నిర్ణయం కోసం గురువుగారి పాదాల దగ్గర రెండు చీటీలు వేసాను. అందులో చేయుము అని వచ్చింది. ఇక గురువుగారిపై భారం వేసి యల్.యల్.బి.లో చేరాను. మాకు అందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. నేను మొదటి నుండి చదివింది తెలుగుమీడియం. కాని ఇప్పుడు ఇంగ్లీష్ మీడియం కావడం వల్ల మొదటి సెమిస్టర్ చదవడం చాలా కష్టం అనిపించింది. గురువుగారూ! నేను ఉత్తీర్ణుడిని కావాలి, నన్ను మీరే శ్రద్ధగా చదివించాలి అని గురువుగారిని వేడుకున్నాను. గురువుగారి ఆశీస్సులతో ఆ సెమిస్టర్‌లో నేను ఉత్తీర్ణత పొందడమే కాకుండా క్లాస్‌ఫస్ట్ వచ్చాను. అప్పుడు చాలా మంది లక్కీగా వచ్చాడు అన్నారు. నా అదృష్టం నా గురువు చెంతన నేను ఉండడమే. మొదటి సెమిస్టరు లాగానే మిగిలిన అన్ని సెమిస్టర్స్‌లో కూడా ఫస్ట్ రావాలని కోరుకుంటూ బాగా చదివాను. ప్రతిసారి పరీక్షకు వెళ్లే ముందు బాబా, గురువుగారికి నమస్కరించుకొని చదువుకున్నవి రావాలని వేడుకొని వెళ్లేవాడిని. అలానే వచ్చేవి. అలా నాలుగు సెమిస్టర్ల తరువాత నేను స్వర్ణపతకానికి దగ్గరలో ఉన్నానని తెలిసి అది కూడా సాధించేలా ఆశీర్వదించమని గురువుగారిని అర్ధించాను. చివరి సెమిస్టర్‌లో ఒక పరీక్ష వ్రాసిన తరువాత వారం రోజులు దసరా సెలవులు వచ్చాయి. అప్పుడు నేను శిరిడీకి వచ్చి నరేంద్ర అంకుల్‌ని కలిసి "నేను స్వర్ణపతకానికి చేరువలో ఉన్నాను, గురువుగారికి చెప్పండి" అన్నాను. అంకుల్ "ఆల్ ది బెస్ట్" అన్నారు. పరీక్షలు అయిపోయి ఫలితాలు వచ్చాయి. నేను ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడనయ్యాను. ఆరు నెలల తరువాత మా విశ్వవిద్యాలయానికి వెళ్లగా అక్కడ నాకు తెలిసిన విషయం నేను మొత్తం యూనివర్శిటీకే ఫస్ట్ అని. నా ఆనందానికి అంతులేదు. పాస్ కావడమే కష్టం అనుకున్న నాకు గురువుగారు




**లక్ష్యశుద్ధితో ఊరక శిరిడీలో గడపడమే ఒక మహత్తర ఆధ్యాత్మిక సాధనగ బాబా విధించారన్న మాట!**

యూనివర్శిటీ మొదటి ర్యాంకు ఇప్పించారు. గురువుగారిని నేను ఒక స్వర్ణపతకం అడుగగా 31, జనవరి 2008న జరిగిన స్నాతకోత్సవంలో మొత్తం మూడు స్వర్ణపతకాలు ఇప్పించారు. సద్గురు అనుగ్రహంతో సాధించలేనిది ఏమీలేదు అని అర్థమయ్యింది.

నేను యల్.యల్.బి. అయిన తరువాత 2006 నుండి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నాను. 2008లో నాకు ఆరోగ్య సమస్య వచ్చింది. డాక్టర్‌కి చూపిస్తే థైరాయిడ్ పరీక్ష, స్కానింగ్ వ్రాసారు. గురుబంధువు అనిల్‌గారి సలహాతో థైరాయిడ్ ఫలితం అనుకూలంగా రావాలని గురువుగారికి ఉత్తరం వ్రాసాను. గురువుగారి ఆశీర్వాదంతో ఫలితాలు అనుకూలంగానే వచ్చాయి. కాని గొంతులో 'అడినోమా థైరాయిడ్' అనే కంతి రావడంతో సర్జరీ చేసి దానిని తీసి, ఆ భాగాన్ని పరీక్షకు పంపారు. గురుదేవుల ఆశీస్సులతో ఆ ఫలితాలు కూడా అనుకూలంగానే వచ్చాయి. గురువుగారు నాకు మరో జన్మను ప్రసాదించారు.

అయితే ఆరోజు నుండి నాకు ఉద్యోగం లేక సమస్యలు ఎదుర్కొంటున్నాను. గురువుగారు చెప్పినట్లు ప్రతిరోజు క్రమం తప్పకుండా సత్సంగాలకు వెళుతున్నాను. ఏ ఉద్యోగ ప్రకటన చూసినా దరఖాస్తు చేసి పరీక్షలు వ్రాస్తుండేవాడిని. చివరకు ఒకరోజు చెన్నైకి నా బయోడేటాను పంపించాను. పరీక్ష తేది నిర్ణయించబడినది అని ఒక వ్యక్తి ద్వారా తెలిసింది. నాకు వాళ్లు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. నేను చెన్నైకి ఫోన్ చేయగా వారు నా బయోడేటా చూసి మే 10, 2008న హైదరాబాదులో పరీక్ష అని, దానికి హాజరుకమ్మని చెప్పారు. నేను ప్రతిసారి పరీక్షకు వెళుతున్నాను. కాని, ఏ ఉద్యోగం రావడం లేదు. డబ్బులు వృధా అవుతున్నాయి. "గురువుగారూ! దయచేసి నాకు ఉద్యోగం వస్తుంది అంటేనే నన్ను హైదరాబాద్ పంపించండి, లేదా ఏదైనా సమస్య తెచ్చి హైదరాబాద్ వెళ్లకుండా పరీక్ష వ్రాయకుండా చేయండి, కనీసం డబ్బులు అయినా మిగులుతాయి" అని వేడుకున్నాను. చివరకి మే 10, 2008 పరీక్షకు వెళ్లాను. పరీక్షలో ప్రతిసారి సంక్షిప్త సమాధాన ప్రశ్నలు ఉంటాయి. నేను గురువుగారిని కొన్ని వచ్చిన ప్రశ్నలు, కొన్ని సంక్షిప్త సమాధాన ప్రశ్నలు ఉండేలా చేయమని కోరుకున్నాను. బాబా, గురువుగారికి నమస్కరించుకొని, ఊదీ పెట్టుకొని పరీక్షకు వెళ్లాను. ప్రశ్నాపత్రం చూసిన నాకు ఆశ్చర్యం, ఆనందం ఒకేసారి కలిగాయి. నేను కోరుకున్న విధంగానే ప్రశ్నాపత్రం వచ్చింది. మొత్తం 35 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష వ్రాసిన రెండు గంటల తరువాత ఇంటర్వ్యూకి అర్హత పొందిన వారి పేర్లు చెబుతామని చెప్పారు. నేను పరీక్షలో ఉత్తీర్ణుడనయ్యి ఇంటర్వ్యూకి అర్హత పొందాలని గురుదేవులకు విన్నవించుకుంటూ ఉన్నాను. రెండు గంటల తరువాత ఫలితాలు వచ్చాయి. మొత్తం




తొమ్మిది మందిని ఇంటర్వ్యూకి ఎంపిక చేసారు. అందులో నాది రెండవ పేరు. గంట తరువాత ఇంటర్వ్యూ అని చెప్పారు. నేను మరలా ఇంటర్వ్యూలో కూడా విజయం సాధించి ఉద్యోగంలో చేరాలని మరలా గురుదేవులకు విన్నవించుకుంటూ ఉన్నాను. ఇంటర్వ్యూలో ఒక ప్రశ్న ఇచ్చి, దానికి న్యాయసలహా అడిగారు. తరువాత మరొక ప్రశ్న అడిగారు. నేను చెప్పిన సమాధానాలకు వారు సంతృప్తి చెందలేదు అనిపించింది. వెళ్లిపోదాము అనుకున్నాను. కాని వారు నన్ను కూర్చోమని మహబూబ్‌నగర్‌లో ఉద్యోగం, ఈ నెల చివరలో చేరాలి మూడు రోజులు చెన్నైలో శిక్షణ ఉంటుందని చెప్పారు. ఆ నిమిషం అంతులేని ఆనందంతో మనస్సులోనే బాబా, గురువుగారికి నమస్కారాలు తెలుపుకున్నాను. మే 10, 2008 నా జీవితంలో మరచిపోలేని రోజు. ***గురువుచెంత స్వాంతన చెందని వ్యధాభరిత హృదయం లేదు*** అని నా అనుభవం ద్వారా చెబుతూ మరొక్కసారి బాబా, గురుదేవుల పాద పద్మములకు నమస్కరిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

I will give my all to save whoever makes me their refuge and constantly thinks of me. It is not by our efforts what we attain anything. It is by grace and grace alone. ఎవరయితే నన్నాశ్రయించుకొని, నా గురించే ఆలోచిస్తారో వారిని రక్షించడానికి నా సర్వస్వాన్ని ధారపోస్తాను అన్నారు సాయి. మనం ఏం సాధించినా అది మన ప్రయత్నంతో కాదు, అది కేవలం సద్గురు అనుగ్రహంతోనే అంటారు పూజ్య గురుదేవులు. సద్గురు పథమంటేనే సాధనాపథం, విజయపథం, సమున్నత పథం. లక్ష్యశుద్ధితో ఉన్న జీవి ఇక్కడకు చేరి సాధించుకోలేనిది ఏదీ లేదు. ఆశ్రయించిన బిడ్డలకు సదా విజయమే! జీవిత గమనం సమున్నతమే! బంగరు పతకాల వెనుక కంగారు లేదు. ఎందుకంటే బంగారంవంటి బాబా–బాబూజీల అనుగ్రహం మనకు తోడుంది కదా!

## బాధ్యతా? బంధమా?

నా పేరు విజయ మాలతి. నన్ను అందరూ చిన్ని, చిన్నా అని పిలుస్తారు. మాది కందుకూరు. మా అక్కపేరు మాధవి. అక్కకి వివాహం చేయడానికి సంబంధాలు చూస్తున్నారు. ఏదీ కుదరడం లేదు. మేనరికం చేయడం అమ్మవాళ్లకి ఇష్టం లేక వద్దనుకున్నారు. కాని సద్గురు నిర్ణయం అదే అయ్యింది. ఆకు కదిలితే అది నా ఆజ్ఞే అన్నారు బాబా. అలా బాబా ఆజ్ఞానుసారం మారిన పరిస్థితుల కారణంగా నాన్నగారు, అమ్మ – అక్క పెళ్లి విషయం మాట్లాడడానికి విజయనగరం వెళ్లారు. పెళ్లి విషయం ఏమవుతుందో అని అందరం ఆందోళనగా ఉన్నాం.




ఆ రాత్రి గురువుగారు స్వప్న దర్శనం ఇచ్చారు. గురువుగారు కలలో కనిపించి నాచేత రోటికి పసుపుకొమ్ముతో ఒక దారం కట్టి పసుపుకొమ్ములు అందులో వేసి 'చిన్నా దంచమ్మా' అని అన్నారు. నేను గురువుగారితో "గురూజీ! నాకంటే పెద్దవాళ్లు చాలా మంది ఉన్నారు, మరి చిన్నదాన్ని నన్ను దంచమంటున్నారేమిటి" అని అడిగితే గురువుగారు "వయసుతో సంబంధం లేదమ్మా, మంచి మనసు కావాలి. అందుకే నిన్ను దంచమంటున్నానని" చెప్పి దగ్గరుండి నా చేత పసుపు కొట్టించారు. గురువుగారితో నేను "చాలా ఆందోళనగా ఉంది. పెళ్లి ఎలా జరుగుతుందో" అని అంటే నాతో "ఇది నా ఇష్ట ప్రకారం జరుగుతున్న పెళ్లి. నేను దగ్గరుండి చేయిస్తున్న పెళ్లి, ఏమీ ఆవేదన చెందవద్దని చెప్పి, పద పద మనం ఇక్కడే ఉంటే పెళ్లి పనులు ఎవరు చూస్తారు?" అని నా భుజం మీద చేయి వేసి నన్ను తీసుకువెళ్లారు. తెల్లవారిన తరువాత నాన్నగారు, అమ్మ ఫోన్ చేసి "పెళ్లి కుదిరింది, పసుపు కొడుతున్నారని" చెప్పారు. సద్గురు అనుగ్రహంతో అక్క వివాహం ఎటువంటి ఆటంకాలు లేకుండా జరిగింది.

తరువాత కొద్ది రోజులకు గురూజీ మరలా నాకు స్వప్న దర్శనం ఇచ్చారు. నాతో మాట్లాడుతూ అక్కవైపు చూసి ఆశీర్వదించారు. తరువాత అక్కకి గర్భనిర్ధారణ అయినది. ఇప్పుడు అక్కకి బాబు పుట్టాడు. బాబు పేరు 'సాయికృష్ణ భరద్వాజ్'. బాబు, అక్కకి – నా గురువు ఇచ్చిన ప్రసాదం. ఇలా నేను పొందిన సద్గురు అనుగ్రహం ఎప్పుడూ నాకు ఎరుకలో ఉండాలని, బాబా–గురూజీలను ప్రార్థిస్తూ వారి పాదాలకు ప్రణమిల్లుతున్నాను.

Have faith and patience. Stay by me and keep quiet. I will do the rest. విశ్వాసాన్ని, ఓర్పును కలిగి వుండు నా చెంత చేరి ఊరకుండు. నేను చేయవలసినదంతా చేస్తాను అన్నారు శ్రీ సాయిబాబా. నాకేది మంచిదో, నాకేది చెరుపో, నాకంటే బాగుగా నాస్వామికెరుక అంటూ సాగే సాయిభక్తుల జీవితం ఆనందంతో శోభిల్లుగాక! సద్గురు శరణాగతి పథమే మార్గంగా, సద్గురు జీవన విధానమే ఆచరణగా, ప్రతి సాయిభక్తుని జీవితం వర్ధిల్లుగాక! తండ్రికి తగ్గ బిడ్డలుగా, 'బాధ్యత'గా జీవిస్తూ సాయితో బంధాన్ని, సద్గురు దేవునితో అనుబంధాన్ని పెంపొందించుకొనుగాక! సాయి భక్తులకు జయం, విజయం, సర్వమూ శోభప్రదము.

**నువ్వు సత్యమని, ఆదర్శమని, సరియైనదని నమ్మిన దానిని మాత్రం ఎవరి కోసమూ, దేని కోసమూ వదులుకోవద్దు. సత్యాన్ని అంటిపెట్టుకో!**



**'తంతు' తలకెక్కితే, ఏ మతసాంప్రదాయమైనా వి'తంతు'వు కాక తప్పదు!**

# ఏది శిరిడీ? ఏది నీ ఒడి?


బాబా, గురుదేవులకు నా నమస్కారములు. నా పేరు డి.లక్ష్మి. మాది వెంటూరు గ్రామం. మా ఊరిలో సత్సంగం మొదలయి ఐదు సం॥లు అయ్యింది. బాబా, గురువుగార్లు నన్ను తమ దగ్గరకు చేర్చుకోవడంలో నిమిత్తమాత్రునిగా ఉన్న వారు శ్రీ మేజర్ సురేష్‌బాబుగారు. ముందుగా వారికి నా కృతజ్ఞతలు. నాకు బాబా, గురువుగారు ఇచ్చిన ఎన్నో అనుభవాలలో రెండు 'గురుకృప' ద్వారా మీతో పంచుకునే అవకాశం కలిగించిన గురుదేవులకు నా కృతజ్ఞతాభివందనములు. మేము మొదటిసారి 2004 అక్టోబరులో శిరిడీ వెళ్లి బాబా, గురూజీని దర్శించుకున్నాం. తరువాత 2005 జూలైలో మళ్లీ శిరిడీ వెళ్లే భాగ్యాన్ని గురువుగారు మాకు ప్రసాదించారు. అప్పటి నుండి ఇంక ఎంత ప్రయత్నించినా శిరిడీ వెళ్లలేకపోయాం. ఒకసారి 2007 మేలో శిరిడీ వెళదామని టిక్కెట్లు బుక్ చేసి క్యాన్సిల్ చేసాము. 2008 మే నెలాఖరులో అనుకోకుండా శిరిడీ వెళ్లాము. బాబా దర్శనం చేసుకున్నాం. కాని గురువుగారిని దర్శించుకోలేకపోయాము. మేము మే 31వ తేదీ ఉదయం శిరిడీ చేరాం. కాని గురువుగారు మే 30వ తేదీ మధ్యాహ్నం శిరిడీ నుండి వెళ్లిపోయారు అని గురుబంధువులు చెప్పారు. ఎంతో ఆశతో వెళ్లిన నాకు ఆ విషయం విన్నాక వారిని చూడాలనే కోరిక ఇంకా ఇంకా ఎక్కువై పోయింది. గురువుగారిని ఎప్పటికి చూడగలను? వారు నాకు ఎప్పటికి అవకాశం ఇస్తారు? అని వారి గురించే ఆలోచిస్తూ ఉండేదాన్ని. ఎలాగైనా నాకు 2008 గురుపూర్ణిమకు మీ దర్శన భాగ్యం కలిగించండి తండ్రీ! అని గురువుగారి పటం వద్ద తరచు అడుగుతూ ఉండేదాన్ని. తెనాలి గురుబంధువులు శ్రీ రత్తయ్యగారికి తరచూ ఫోన్ చేసి, నా అనుభవాలు, సమస్యలను వారికి చెప్తూ ఉండేదాన్ని. వారు మనకు బాబా, గురువుగారు ఉన్నారు అని ధైర్యం చెప్తూ ఉండేవారు. నేను మేలో శిరిడీ వెళ్లి వచ్చిన తరువాత వారికి ఫోన్ చేసి చెప్పాను. బాబా దర్శనం అయ్యింది. కాని గురువుగారి దర్శనం కాలేదు అని. నా భర్తతో కలసి శిరిడీ వెళ్లి, బాబా-గురూజీ దర్శనం చేసుకోవాలని నా మనస్సులో వున్న కోరికను నరేంద్రగారి ద్వారా గురువుగారికి విన్నవించమని చెప్పాను. నేను కూడా గురువుగారిని ఈ విషయం గురించి తరచూ అడిగే దాన్ని. 2008 గురుపూర్ణిమకు 20 రోజుల ముందు కలిసినపుడు నరేంద్ర గారితో చెప్పడం కుదరక ఈ విషయం (నాభర్తతో కలిసి శిరిడీ వెళ్లి బాబా, గురూజీని దర్శించుకోవాలనే నా కోరికను) మద్రాస్ యువకుల సత్సంగంలో ఒక ఉత్తరం రాసి బాబా, గురూజీ పాదాల దగ్గర పెట్టారట రత్తయ్యగారు. వారు తెనాలి తిరిగి వచ్చిన మూడు రోజులకి నేను ఫోన్ చేసి, గురువుగారు మా ప్రయాణం



కన్‌ఫర్మ్ చేసారు అని రత్తయ్యగారికి చెప్పాను. ఈ విషయం విని చాలా ఆనందించి, వారు నా గురించి రాసి పెట్టిన ఉత్తరం విషయం చెప్పారు. అది విని చాలా ఆనందం, ఆశ్చర్యం నాకు కలిగాయి. గురుపూర్ణిమకు మేమందరం శిరిడీ వెళ్లి బాబా, గురూజీని దర్శనం చేసుకొని ఎంతో ఆనందంతో  ఇంటికి తిరిగి వచ్చాము. ఇది నాకు గురువుగారు ఇచ్చిన అద్భుతమైన అనుభవం. జీవితంలో మరచిపోలేనిది. ఎందుకంటే వెంట వెంటనే శిరిడీ వెళ్లడం అనేది నా భర్త మనస్తత్వానికి పూర్తిగా విరుద్ధం. అది గురుదేవుల అనుగ్రహంతోనే సాధ్యం అయ్యింది. ఊరు మారడంతో ప్రస్తుతం సత్సంగం, నామసంకీర్తనలకు దూరం అయిన నన్ను త్వరలోనే నాభర్తతో కలిసి సత్సంగాలకు వెళ్లేలా అనుగ్రహించమని  వేడుకుంటున్నాను.

మా మరిదికి 2007 నాటికి పెళ్లై ఐదు సం॥లు అయ్యింది. మా తోడికోడలికి పిల్లలు లేరు. 2006 ఆగస్ట్ 20కి మా మరిదికి, తోడికోడలికి లండన్ వెళ్లడానికి వీసా వచ్చింది. లండన్ వెళ్లడానికి పది రోజుల ముందు మా మరిది, చెల్లాయి వచ్చి వెంటూరులో ఒక వారం రోజులు ఉన్నారు. అపుడు ఏదో మాటల సందర్భంలో పిల్లలు లేని కారణంగా తను పడే బాధను, కొంతమంది మాట్లాడే సూటిపోటి మాటలను చెప్పుకొని నా దగ్గర బాధపడి కళ్లనీళ్ల పర్యంతం అయింది. అపుడు నేను ఇలా చెప్పాను. బాబా, గురూజీకి ఒక ఉత్తరం రాసి పెట్టుకో. గురువుగారు నీకు ఖచ్చితంగా పిల్లల్ని ఇస్తారు. అనుమానం లేదు. మీరు లండన్ నుండి వస్తూ, గురువుగారు ఇచ్చిన బుడతడితో తిరిగివస్తారు అని, నా దగ్గర ఉన్న సాయిపథం, శిరిడీది పోస్టల్ అడ్రస్ ఇచ్చాను. తను రెండు ఉత్తరాలు వ్రాసుకొని ఒకటి పోస్టులో వేసింది, ఇంకొకటి నాకు ఇచ్చింది సత్సంగంలో పెట్టమని. నేను ఆ ఉత్తరాన్ని సత్సంగంలో గురువుగారి పటం వద్ద ఉంచి వారికి బిడ్డల్ని ప్రసాదించమని మనస్ఫూర్తిగా అడిగాను. మా అందరి మొర బాబా, గురూజీ ఆలకించారు. 2007 ఫిబ్రవరిలో మేమందరం బొడ్డపాడు నామసప్తాహానికి బయలుదేరడానికి ఒకరోజు ముందర లండన్ నుండి ఫోన్ వచ్చింది, మాధవికి ప్రెగ్నెన్సీ కన్‌ఫర్మ్ అయ్యిందని. ఇది ఖచ్చితంగా గురువుగారి అనుగ్రహ మహిమ అని మరొక్కమారు మా అందరి మనసులలో ఆనందం. బాబా, గురూజీ ఆశీస్సులతో వారికి 2007 అక్టోబర్ 13న మగబిడ్డ పుట్టాడు. 2008 జనవరిలో వాళ్లు గురువుగారు ఇచ్చిన ప్రసాదం (సాయినందన్)తో ఇండియాకు వచ్చారు. వాడి చిట్టి పొట్టి మాటలతో మొదటగా అన్న మాట 'బాబా' కావడం మాకు మరింత ఆనందం. ఈ చక్కటి అనుభవంతో మా మరిదికి, మా చెల్లాయికి కూడా బాబా, గురూజీల మీద భక్తి, ప్రేమలు మరింత బలపడ్డాయి.

తలచుకుంటే ఆనందంతో ఒళ్లు గగుర్పొడుస్తుంది. మనందరి మీద గురూజీకి ఎంత ప్రేమ.
నాలో ఏ అర్హత లేకపోయినా నేను కోరినదల్లా  ఇస్తున్న ఆ సద్గురుదేవునికి నమస్సులతో...
జన్మ జన్మలకు వారి బిడ్డగానే పుట్టాలని, బ్రతకాలని నా గురుదేవులను కోరుకుంటూ...




**తమకేది మంచిదో అది బాబా తప్పక చేస్తారనే విశ్వాసం**
**సాధనాపథంలో ప్రథమ సోపానం.**

I live in Shirdi and everywhere. నేను శిరిడీలోనూ, అంతటా ఉన్నాను. ఒకసారి శిరిడీలో అడుగుపెట్టాక వారి జీవితం ఇంతకుమునుపులా ఉండదు, అంటూ సాయి ఇచ్చిన అభయమే సాయి భక్తులకు శరణ్యం. సాయిపద స్పర్శతో పునీతమైన శిరిడీ క్షేత్రం సాయిభక్తులకు ఆనంద సన్నిధానం. ఆ సద్గురుదేవుని తలపే జీవితానికి మలుపు. పిలిస్తే పలుకుతూ, తలిస్తే దర్శనమిచ్చే ఆ సద్గురురాయుని దర్శించ ఇచ్ఛ కలిగితే కరిగిపోతాడు, దర్శనమిస్తాడు. తన భక్తులతోపాటు కోరి వచ్చిన వారికి కొంగుబంగారమవుతాడు, ఒడిని పండిస్తాడు. మనసును గుడిగా మలుస్తాడు.

## కాయా? పండా?

పూజ్య గురుదేవులు సద్గురు సాయినాథుని శరత్‌బాబూజీగారి పాద పద్మములకు నమస్కారములు తెలుపుకుంటూ నా అనుభవాన్ని మీతో పంచుకుంటున్నాను. నా పేరు శైలజ. మాది విజయనగరం. మనం అడిగినది బాబా ఇస్తారన్నది జీవితంలో నిజం అయ్యింది. నాకు ఇద్దరు అబ్బాయిలు. నాకు పాప కావాలని మనసులో బాబాకు చెప్పుకుంటూ ఉన్నాను. నాకు నెలలు నిండాయి. ఆపరేషన్ చేయాలని, ఆలస్యం అయితే, పాపకు, నాకు ప్రమాదమని చెప్పారు. ఆలస్యం అయితే పాప కమిలిపోతుందని అన్నారు. నాకు చాలా భయం వేసింది. బాబానే మనసులో తలచుకుంటూ ఉన్నాను. మా చెల్లెలు పెళ్లికోసం సింగరాయకొండ నుండి పిన్ని, బాబాయి వచ్చారు. పిన్ని నా ప్రక్కనే ఉండి సాయినామం చెప్తూ ఉంది. గురువుగారిని తలుస్తూ ఊదీ నా పొట్టకి రాసి నోటిలో కొంచెం వేసింది. అంతే బాబా నా మొర విన్నారు. ఆపరేషన్ అవసరం లేకుండానే కుట్లు కూడా పడకుండా నాకు సుఖ ప్రసవం జరిగింది. పాప పుట్టింది. మాకు చాలా సంతోషం కలిగింది. పాప అరచేతులు, అరికాళ్లు, ముఖం కమిలి ఉన్నాయి. ఇపుడు అంతా తగ్గి, పాప ఆరోగ్యంగా ఉంది. బాబా గురువుగార్లు ఎంతో ఆపద నుండి నన్ను, పాపని కాపాడారు. ఈ సంఘటన నాకు ఎంతో సంతోషం కలిగించింది.

నాటి మైనతాయి ప్రసవవేదనను తీర్చడానికి రామ్‌గిరి బువాతో బాబా పంపిన ఊదీ అవసరమయితే, నేడు సద్గురు దేవులు పూజ్యశ్రీ బాబూజీ ప్రసాదించిన మహితవరం 'సాయిబాబా' నామం ఎంతోమంది కష్టాల నుండి, కన్నీళ్ల నుండి కడతేరుస్తోంది. ఎలాంటి ఇబ్బంది లేకుండా 'పాపను' ప్రసాదించారు గురుదేవులు గురుబంధువు శైలజకు. కొసమెరుపు ఏమిటంటే సాయి చెప్పిన 'మామిడి పండ్లు' తన వద్దనున్నా శైలజ కోరుకున్న 'చింతకాయ'ను అందించడం.



"ఏ సందర్భంలోనూ శిష్యుడు గురువును విడిచి పెట్టకూడదు" అన్న సత్యాన్ని ఆచరణపూర్వకంగా చూపించేవారు
– శ్రీసాయిబాబా

# Power of Love



నిజానికి మనం బాబాకు దగ్గరగా ఉన్నాం. బాబానే చూస్తున్నాం.

అసలు బాబాకు దూరంగా ఎప్పుడున్నాం కనుక.


కానీ, నేను బాబాకు దూరంగా ఉన్నాను, బాబా ఎక్కడో  మనకు కనిపించకుండా అతీతంగా ఉన్నారు

–అన్న ఇలాంటి భావనలే అసలు అడ్డుగోడ.

బాబాకు దగ్గరవ్వాలంటే ఏమి చేయాలి? ఆ అడ్డుగోడను పడగొట్టాలి.

అప్పుడు ఎంత దగ్గరవుతాం అంటే –

బాబాకు  'నువ్వే నేను, నేనే నువ్వు' అన్నంత దగ్గరవుతాం.


జీవిత సరళిని మార్చేది
గురువచనం...
జీవన శైలిని తెలిపేది
గురుగమనం...



## October

2008

| S | M | T | W | T | F | S |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | 30 | 31 | |

## November

| S | M | T | W | T | F | S |
|---|---|---|---|---|---|---|
| 30 | | | | | | 1 |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 |
| 16 | 17 | 18 | 19 | 20 | 21 | 22 |
| 23 | 24 | 25 | 26 | 27 | 28 | 29 |

## December

| S | M | T | W | T | F | S |
|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
| 28 | 29 | 30 | 31 | | | |